క్లుప్తంగా

పారిశుద్ధ్య పనులపై నిర్లక్ష్యం వద్దు



పంప్ హౌస్ వద్ద పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో పారిశుద్ధ్య పనుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సిబ్బందిని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి హెచ్చరించారు. సోమవారం ఉదయం పట్టణంలోని పంప్ హౌస్ ప్రాంతంలో పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. మురుగు కాలువలు శుభ్రం చేసిన తరువాత చెత్తాచెదారాన్ని అక్కడే వుంచకుండా డ్రై అయిన తరువాత తరలించాలన్నారు. అలాగే పట్టణంలోని ప్రధాన డ్రైనేజీల్లో పూడికతీత పనులను పరిశీలించిన కమిషనర్ కాలువలపై ఆక్రమణలను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ నీరజ, ఏఈ మదన్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో మెలగాలి



హోంగార్డులకు సూచనలిస్తున్న సదరన్ రేంజ్ కమాండెంట్ మహేష్

ఆదోని అర్బన్: పోలీసుశాఖలో హోంగార్డులు క్రమశిక్షణతో ఉంటూ అధికారులు, ప్రజలతో మెప్పు పొందాలని సదరన్ రేంజ్ కమాండెంట్ మహేష్, హోంగార్డు డీఎస్పీ కృష్ణమోహన్ అన్నారు. సోమవారం స్థానిక రెడ్డీస్ కల్యాణ మండపం ఆవరణలో హోంగార్డులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పోలీసుశాఖలో ఎలా ఉండాలి, ప్రజలతో ఎలా ప్రవర్తించాలనేది వివరించారు. కార్యక్రమంలో హోంగార్డు ఇన్‌చార్జి వెంకటనాయక్, హోంగార్డులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించాలి

నందవరం: ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించాలని ఎంపీడీఓ కిరణ్ మోహన్ రావు రైతులకు సూచించారు. సోమవారం నందవరంకు వచ్చిన కొబ్బరి, జామా, దానిమ్మ, సీతాఫలం మొక్కలను రైతులకు పంపిణీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 80 మంది రైతులకు 6,500 మొక్కలు అందజేసినట్లు తెలిపారు. ఏపీఓ శ్రీనివాసులు, ఈసీ నూర్జహాన్, టెక్నికల్ అసిస్టెంట్స్, ఫీల్డు అసిస్టెంట్స్‌లు పాల్గొన్నారు.

అనుమతిలేని మందులు విక్రయిస్తే చర్యలు

గోనెగండ్ల : పురుగు ఎరువుల మందుల డీలర్లు అనుమతిలేని బయోమందులు, గ్లైఫోసిట్ తదితర గడ్డి మందులను విక్రయిస్తే చర్యలు తప్పవని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏఓ హేమలత హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని ఆర్‌బీకేలో పురుగు, ఎరువుల మందుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పురుగు మందులకు సంబంధించి పీసీలు తప్పకుండా ఉంచుకోవాలన్నారు. అలాగే స్టాకు రిజిస్టర్, ధరల పట్టిక బోర్డును ప్రతి రోజు అప్‌డేట్ చేయాలన్నారు. మందులు కొనుగోలు చేసిన రైతుకు రసీదు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు.

డమ్మీ అకౌంట్లలో పంట నష్టపరిహారం జమ



సబ్‌కలెక్టర్ శివనారాయణస్వామికి వినతి పత్రం అందజేస్తున్న పెద్దహరివాణం రైతులు

ఆదోని రూరల్: మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో పంట నష్టపరిహారం రైతుల ఖాతాల్లో కాకుండా డమ్మీ అకౌంట్లలో జమ అయ్యాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం ఆదోనిలోని సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని ధర్నా చేపట్టారు. సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మకు వినతి పత్రం అందజేశారు. రైతులు మాట్లాడుతూ 25 మందికి వేరే ఖాతాల్లో జమ చేయగా, 630 మందికి సంబంధించిన పరిహారం రైతుల కాని వారి ఖాతాల్లో జమ చేశారని ఆరోపించారు. విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు.

కేజీబీవీ ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని మైనారిటీ కాలనీలో ఉన్న కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులకు సక్రమంగా భోజనాలు పెట్టకుండా ఇబ్బంది పెట్టిన ప్రిన్సిపాల్ కవితపై సత్వరం కఠిన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి రాజేష్, యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర కన్వీనర్ ఉదయ్‌కుమార్, పీఎస్‌యూ జిల్లా కార్యదర్శి సురేష్ కోరారు. ఈ మేరకు సోమవారం కర్నూలు కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. విద్యాశాఖ అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవడంలో జాప్యం చేస్తున్నారన్నారు.

నిర్వహణ లేక నిరుపయోగం

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాడు–నేడు కింద పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు
- నిర్వహణ లోపం కారణంగా నిరుపయోగంగా మారుతున్న వైనం
- అందుబాటులో ఉన్న నీటినే తాగుతున్న విద్యార్థులు
- కలుషిత నీటితో రోగాల బారినపడే ప్రమాదం



నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న ఆర్వో ప్లాంట్



కల్లుబావి ప్రాథమిక పురపాలక పాఠశాలలో మూలన పడిన శుద్ధజల మిషనరీ

ఆదోని సెంట్రల్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మన బడి నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా సౌకర్యాలు కల్పించింది. ఇందులో భాగంగా ప్రభుత్వ బడులలో చదువుతున్న విద్యార్థులకు శుద్ధమైన తాగునీరు అందించాలని పాఠశాలలోనే ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేసింది. అయితే ప్రస్తుతం వాటిపై పర్యవేక్షణ లోపం, నిర్వహణ లేక చాలా పాఠశాలల్లో మూలన పడుతున్నాయి. దీంతో విద్యార్థులకు శుద్ధజలం అందడంలేదు. తప్పని పరిస్థితిలో అందుబాటులో ఉన్న నీళ్లను తాగుతున్నారు. కలుషితమైన నీరు తాగడం వలన విద్యార్థులు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రూ.లక్షలు వెచ్చించి ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు

ఆదోని నియోజకవర్గంలో మొదటి విడతలో నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలలు రూపు రేఖలను మార్చడమే కాకుండా పాఠశాలల్లో చదివే విద్యార్థులకు శుద్ధమైన తాగునీరు అందించేందుకే రూ.లక్షలు వెచ్చించి ఆర్‌ఓ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగానే నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాల, పురపాలక ప్రాథమిక పాఠశాల కల్లుబావి, పురపాక ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల పాఠశాలలలో కూడా శుద్ధజల యంత్రాలను బిగించారు. అయితే ప్రస్తుతం ఆయా పాఠశాలల్లో నిర్వహణ లోపం కారణంగా ఆర్‌ఓ ప్లాంట్లు పని చేయడం లేదు. ఒక పాఠశాలల్లో మోటార్ కాలిపోతే, మరొక పాఠశాలలో కాయిల్స్ కాలిపోయి పనిచేయడంలేదు. దీంతో విద్యార్థులు అందుబాటులో ఉన్న కుళాయి నీళ్లనే తాగుతున్నారు. ఆర్వో ప్లాంట్లకు మరమ్మతులు చేపట్టకపోతే అవి శాశ్వతంగా మూలన పడే ప్రమాదం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

వ్యాధుల బారిన పడే ప్రమాదం

వర్షా కాలంలో కలుషితమైన నీరు తాగడం వలన విద్యార్థులు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంది. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి ఏర్పాటు చేసిన ప్లాంట్స్ మరమ్మతులు చేపట్టి వాటిని ఉపయోగించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఏ మాత్రం అలసత్వం ప్రదర్శించినా, పర్యవేక్షణ లోపించినా ప్లాంట్స్ నిరుపయోగంగా మారుతాయి. ఆతరువాత మరమ్మతులు చేయించినా బాగయ్యే అవకాశం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనాపాలకులు అధికారులు స్పందించి ఆర్‌ఓ ప్లాంట్లకు మరమ్మతు చేపట్టి ఉపయోగంలోకి తీసుకొని రావాల్సిన అవసరం ఉంది.

కంపెనీ వారికి ఫిర్యాదు చేశాం



ఆర్‌ఓ ప్లాంట్ పని చేయడం లేదని కంపెనీ వారికి ఆన్‌లైన్లో ఫిర్యాదు చేశాం. వారి నుంచి ఎలాంటి స్పందన లేదు. ప్లాంట్ మోటార్ కాలిపోయింది. దానిని రీ ప్లేస్ మెంట్ చేసి తిరిగి మోటార్ బిగిస్తే ప్లాంట్ రన్ అవుతుంది. ప్లాంట్ నిర్వహణపై ఎప్పటికప్పుడు కంపెనీ వారు స్పందించి మరమ్మతులు చేస్తే విద్యార్థులకు శుద్ధమైన తాగునీరు అందించవచ్చు.
– అలీమ్ సిద్దిఖీ, ప్రధానోపాధ్యాయుడు నెహ్రూమెమోరియల్ ఉన్నత పాఠశాల ఆదోని

విద్యావ్యవస్థ బలోపేతానికి ఉద్యమించాలి

ఎమ్మిగనూరుటౌన్: విద్యావ్యవస్థ బలోపేతానికి ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా వుందని, విద్యావ్యవస్థలోని సమస్యలపై చర్చ జరిపేందుకు నిర్వహించే ఎస్ఎఫ్ఐ 47వ ప్లీనరీని విజయవంతం చేయాలని ఆసంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా కోరారు. సోమవారం స్థానిక కేవీపీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆదర్శ పాఠశాలలు, గురుకుల, కేజీబీవీ పాఠశాలల్లో సీట్లు రాకపోవడంతో విద్యార్థులు చదువులకు దూరమయ్యే దుస్థితి నెలకొందన్నారు. ఆయా పాఠశాలల్లో సీట్లను పెంచాలన్నారు. ఎస్ఎఫ్ఐ ప్లీనరీ సమావేశాలను విద్యార్థులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

ఆదోని రూరల్: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి టి.గాదిలింగప్ప కోరారు. ఈ మేరకు సోమవారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విజయశేఖర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి కొత్త ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. జీవో నంబర్ 117ను రద్దు చేయాలన్నారు. జీవో నం.55 ప్రకారం టీచర్లను కేటాయించాలని, ఒకటి నుంచి ఐదవ తరగతులు ఒకే పాఠశాలగా నడపాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు రామాంజనేయులు, మల్లికార్జున, నాయకులు రుద్రముని, ఉరుకుందయ్య, కృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్స్ ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఎన్‌సీసీ అధికారులు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని పురపాలక మైదానంలో వన్ ఆంధ్ర మెడికల్ కంపెనీ అధ్వర్యంలో సోమవారం విద్యార్థులను ఎన్‌సీసీకి ఎంపిక చేశారు. ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ మేజర్ వైవీసీకే రెడ్డి సమక్షంలో జరిగిన ఎంపికలో నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాల నుంచి 8వ తరగతి చదువుతున్న 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. శారీరక, ఆరోగ్య పరీక్షలను నిర్వహించి 120 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. కార్యక్రమములో ఎన్‌సీసీ అధికారులు అనిల్ కుమార్, ఉరుకుందప్ప, ఎన్‌సీసీ సిబ్బంది రాజేష్ కుమార్, రాజేంద్ర సింగ్, వంశీ పాల్గొన్నారు.

కోసిగి: మండల కేంద్రంలోని మౌంట్ కార్మెల్ స్కూల్‌లో చదువుతున్న 25 మంది విద్యార్థులు ఎన్‌సీసీ క్యాంప్‌నకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ జాన్సన్ తెలిపారు. సోమవారం ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఫాదర్ టోనీ, ఫాదర్ థోమస్, ఫాదర్ జోజి, పీఈటీలు శేఖర్, పరుశురామ్ ఉన్నారు.

ఈరన్నస్వామికి పూజలు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో స్వామి క్షేత్రం సందడిగా మారింది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున సుప్రభాత సేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. ఆలయంలో కొందరు భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు.

మాధవరం పంప్ హౌస్ పరిశీలన



పంప్ హౌస్‌ను పరిశీలిస్తున్న ఆదోని డీఎస్పీ

మంత్రాలయం: గురురాఘవేంద్ర ప్రాజెక్ట్ పరిధిలోని మాదవరం స్టేజ్–1 పంప్‌హౌస్‌లో దుండగులు స్టాటర్‌లను, మోటార్‌లను ధ్వంసం చేశారు. దీంతో సోమవారం ఆదోని డీఎస్పీ నారాయణ స్వామి పంప్ హౌస్‌ను పరిశీలించారు. పంప్‌హౌస్‌లో 15 కాపర్ షీట్లును ఎత్తికెళ్లినట్లు గుర్తించారు. దాదాపు రూ.9లక్షల విలువైన పంప్‌సెట్లు, కాపర్ షీట్లు ధ్వంసమైనట్లు తెలిపారు. ఆయనతో పాటు కోసిగి సీఐ ప్రసాద్, మాధవరం ఎస్ఐ కృష్ణమూర్తిలు ఉన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

గోనెగండ్ల : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా అన్నారు. మండల కేంద్రం గోనెగండ్లలోని మూడవ సచివాలయ పరిధిలో డెంగీ కేసులు నమోదు కావడంతో సోమవారం మలేరియా అధికారులు, వైద్య సిబ్బంది ఆ ప్రాంతంలో పర్యటించారు. నీరు నిల్వ ఉన్న డ్రమ్ములు, గచ్చులను పరిశీలించి దోమల నివారణకు మందును స్ప్రే చేయించారు. సూపర్‌వైజర్లు హనుమంతు, సుధాకర్, ఏఎస్‌ఎంలు ప్రమీలా, మాధవి సిబ్బంది పాల్గొన్నారు.

గుడిసెలకు మీటర్లు బిగించండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో ఖుబా మసీదు సమీపంలోని గుడిసెలకు విద్యుత్ మీటర్లు బిగించాలని ఆ ప్రాంత మహిళలు డిమాండ్ చేశారు. సోమవారం విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట సీఐటీయూ మహిళా సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేసి వినతిపత్రాన్ని డీఈఈ రాఘవేంద్రారావుకు సమర్పించారు. సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు, మహిళా సంఘం నాయకురాలు షబానా మాట్లాడుతూ జనవరి నెలలో విద్యుత్ మీటర్ల కోసం చలానాలు కట్టినా నేటికీ మీటర్లు బిగించలేదన్నారు. నాయకులు ముంతాజ్, గౌసియా, మాబ్బి, రాజు, డి.ఉస్మాన్‌వలి, చాంద్‌బాష తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

నందవరం : మండలంలోని గురు రాఘవేంద్ర ఎత్తిపోతల పథకాల నుంచి రిజర్వాయర్లకు నీటిని పంపింగ్ చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్న ఆ శాఖ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎల్లెల్సీ డిస్ట్రిబ్యూటర్ మాజీ డైరెక్టర్ గద్దం నారాయణ రెడ్డి కోరారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆదోని డివిజన్ వర్షాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సాగుచేసుకున్న పంటలు వాడుముఖం పడుతున్నాయన్నారు. వారం రోజులుగా తుంగభద్ర నదిలో వరద నీరు పుష్కలంగా ప్రవహిస్తున్నా ఇంతవరకూ రిజర్వాయర్లకు నీటిని లిఫ్ట్ చేయకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా జీఆర్‌పీ అధికారులు వెంటనే పంపింగ్ ప్రక్రియ చేపట్టాలన్నారు.

పంట నష్ట పరిహారం చెల్లించాలి

కోసిగి: మండలంలో వర్షాలు లేక సాగు చేసుకున్న పంటలు ఎండి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం, కిసాన్ మోర్చ తాలూకా నాయకులు కె. ఉలిగయ్య, కోసిగి మండల అధ్యక్షుడు తాయన్న కోరారు. సోమవారం కోసిగి మండలంలో రైతులు సాగు చేస్తున్న పత్తి, వేరుశనగ పంటలు పరిశీలించారు. నష్ట పోయిన పంటలకు ఎకరాకు రూ.20వేలు చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నాయకులు ఓంకార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీటీఏ ఆవిర్భావ దినోత్సవం

ఆదోని సెంట్రల్: స్థానిక బహుజన టీచర్స్ అసోసియేషన్ కార్యాలయంలో బీటీఏ 24వ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా అధ్యక్షుడు భాస్కర్ అధ్యక్షతన సోమవారం ఘనంగా నిర్వహించారు. సీనియర్ నాయకులు జయరాం బహుజన టీచర్స్ అసోసియేషన్ జెండాను ఆవిష్కరించారు. జిల్లా గౌరవాధ్యక్షుడు డి.రామశేషయ్య, నందీశ్వరుడు, రామకృష్ణ, జనార్దన్, రాము, సుధాకర్ పాల్గొన్నారు.

విద్యారంగాన్ని కాపాడుకుందాం

నందవరం : ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలను వెంటనే చేపట్టాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యుటీఎఫ్) గౌరవ అధ్యక్షులు, జిల్లా కార్యదర్శి, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్.దావీదు, దేవపాల్, జె ఎల్లప్ప డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ ఓబులేసు, ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు, ఎంఈఓలు రామాంజనేయులు, రఘునాథ్‌లకు వినతి పత్రాలను అందజేశారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: వ్యవసాయ కార్మికుల సంక్షేమానికి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ నారాయణ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో సంఘం కార్యవర్గ సభ్యుల సమావేశం నిర్వహించారు. లింగన్న, బి.వీరేశఖర్, తిక్కన్న, రామాంజినేయులు పాల్గొన్నారు.

సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి



వినతులు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్

ఆదోని రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలని సబ్ కలెక్టర్ శివనారాయణశర్మ ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం – పీజీఆర్ఎస్‌లో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఆయన స్వీకరించారు. మండంలోని ఆయాశాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎసెల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలనాధికారి ఆర్.శేషయ్య, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, ఆర్టీసీ డిపో మేనేజర్ మహమ్మద్‌రఫీ, ఆర్టీఓ నాగేంద్ర, గృహ నిర్మాణశాఖ డిప్యూటీ ఇంజనీర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆదోని సెంట్రల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న ఇంటర్మీడియెట్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతో పాటు మధ్యాహ్న భోజనం అందించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ, జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున కోరారు. సోమవారం సబ్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మకు వినతి పత్రం సమర్పించారు.

ఆదోని రూరల్: బీసీ, ఎస్సీ, సంక్షేమ హాస్టళ్లలో పెండింగ్‌లో ఉన్న మెస్ చార్జీలను వెంటనే విడుదల చేయాని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కృష్ణ, ఖాజా కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



అర్జీలను స్వీకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి

ఆదోని టౌన్: పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం కమిషనర్ ఛాంబర్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ఇంజినీరింగ్ సెక్షన్‌లో రోడ్లు, కాలువలు ఏర్పాటు చేయాలని ముగ్గురు, టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లో అక్రమ భవన నిర్మాణాలను తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కమిషనర్‌కు వినతులు అందజేశారు.

సాయిబాబా నగర్‌లో కమిషనర్ పర్యటన

పట్టణంలోని 20వ వార్డు సాయిబాబానగర్‌లో సోమవారం మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు హరినాథ్, శ్రీనివాసులు, మేస్త్రీ బాషా, సచివాలయం, శానిటేషన్ సెక్రటరీ, మేస్త్రీలు సోమవారం కలియతిరిగారు. వార్డులో సందుసందు తిరుగుతూ మురుగు కాలువల అపరిశుభ్రతపై సంబంధిత సెక్షన్ అధికారులను కమిషనర్ ప్రశ్నించారు. ఏరోజుకారోజు లభ్యమైన చెత్తాచెదారాన్ని త్వరితగతిన శుభ్రం చేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అలాగే ఎస్కేడీ కాలనీ, ఎన్‌జీఓస్ క్లబ్ ఏరియాలోనూ తనిఖీలు చేశారు. షాపులు, ఇళ్ల ముందు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

రాజగోపుర ద్వారాలకు తలుపులు



ఉత్తర ద్వారం వద్ద తలుపులకు పాలిష్ చేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయ రాజగోపుర ద్వారాలకు రూ.44 లక్షలతో తలుపులు ఏర్పాటు చేస్తున్నట్లు దేవాలయ డిప్యూటీ కమిషనర్ హెచ్.జి. వెంకటేశ్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తూర్పు రాజగోపురం ద్వారం తలుపులను మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి విరాళంగా అందజేశారని తెలిపారు. ఉత్తర ద్వారం తలుపులను కర్నూలుకు చెందిన భక్తుడు వెంకటేశయ్య విరాళంగా ఇచ్చారని, పశ్చిమ, దక్షిణ ద్వారాల తలుపులను రాయచూరు పట్టణానికి చెందిన భక్తుడు విరాళంగా అందజేశారన్నారు. వచ్చేనెల 4వ తేదీ నాటికి తలుపుల పాలీష్ పనులు పూర్తి చేస్తామని చెప్పారు. టెంకాయలను కొట్టే కట్టాను కూడా నిర్మిస్తున్నట్లు తెలిపారు.

మార్కెట్ వేలాల్లో పెరిగిన ఆదాయం

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని మార్కెట్‌లు, వారపు సంతల వేలం పాటలను సోమవారం మున్సిపల్ కౌన్సిల్‌హాల్‌లో కమిషనర్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయా మార్కెట్‌లకు సంబంధించి గతేడాదితో పోలిస్తే రూ.27,07,666 అదనపు ఆదాయం వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఝాన్సీలక్ష్మీబాయి(జేఎల్‌బీ) కూరగాయల మార్కెట్‌కు రూ.61.21 లక్షలు ఆదాయం వచ్చింది. గతేడాది కంటే రూ.13,87,667 అదనంగా ఆదాయం వచ్చింది. పశువులసంత మార్కెట్ రూ.21,50,000 వేలం పోగా గతేడాది నుంచి రూ.9,63,333 వనకూరింది. గొర్రెలు, మేకల మార్కెట్‌ను రూ.7.50 లక్షలకు పాటను నిర్వహించారు. ఈ మార్కెట్ ద్వారా మున్సిపాలిటీకి రూ.3,56,666 అధిక ఆదాయం వచ్చింది.

వ్యవసాయ మోటార్, స్టాటర్ ధ్వంసం

కోసిగి: మండల పరిధిలోని తుంబిగనూరు గ్రామ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు వారం ఈరన్న పొలంలో వ్యవసాయ మోటార్, స్టాటర్, పైపులను ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. ఈరన్న సోమవారం ఉదయం పొలంలో వరినాట్లు వేసేందుకు వెళ్లి చూసేసరికి మోటార్, స్టాటర్, పైపులను కోసి చెల్లాచెదురుగా పడేసి ఉండటం గమనించాడు. తనపై కక్ష సాధింపుతో దుండగులు మోటార్, పైపులు ధ్వంసం చేశారని బాధితుడు ఆరోపించాడు. దాదాపు రూ.50వేలుకు పైగా నష్టం వాటిల్లిందని, మూడేళ్లుగా ప్రతి ఏటా తన పొలంలోని మోటార్, పైపులు ధ్వంసం చేస్తున్నారని వాపోయాడు. ఈ విషయంపై కోసిగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లానని, అయితే ఎస్ఐ అందుబాటులో లేకపోవడంతో వెనుతిరిగి రావాల్సి వచ్చిందని తెలిపాడు. పోలీసులు విచారించి దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరాడు.

పంట కాలువలకు నీరు విడుదల



మేజర్ కాలువకు నీరు విడుదల చేస్తున్న రైతులు

కౌతాళం: ఎల్ఎల్‌సీ సిబ్బంది రైతులతో కలిసి కౌతాళం మేజర్ కాలువకు సోమవారం ఎల్లెల్సీ నుంచి సాగునీరు విడుదల చేశారు. తుంగభద్ర దిగువ కాలువకు నీరు రావడంతో పిల్ల కాలువలకు కూడా సాగు నీరు వదలాలని రైతులు కోరడంతో సాగు నీరు విడుదల చేసినట్లు ఏఈ రంగస్వామి తెలిపారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా గ్రామాల్లో తాగునీటితో పాటు రైతులు వరినారు మళ్లు కూడా ఎండిపోతున్నాయని ఫిర్యాదులు వచ్చాయన్నారు. రైతులు ముందుగా వరినారు మళ్లకు నీరు పెట్టుకోవాలని సూచించారు. కాలువలకు సాగు నీరు వదలడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతులు కాశీవిశ్వనాథ్, రెడ్డప్ప, పుగ్గినాగ, గురుస్వామి, శివ, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

ఈ-స్టాంప్ దందాపై చర్యలు తీసుకోవాలి

ఆదోని రూరల్: ఆదోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ–స్టాంపు దందాకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.అజయ్‌బాబు, సీపీఐ పట్టణ కార్యదర్శి ఎస్.సుదర్శన్ డిమాండ్ చేశారు. అధిక ధరలకు ఈ–స్టాంపు పత్రాలు విక్రయం చేస్తున్న స్టాంప్ వెండర్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆదోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం దగ్గర ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు కుమారస్వామి, లక్ష్మీనారాయణ, విజయ్, భీమేష్, కొత్తూరు గంగన్న తదితరులు పాల్గొన్నారు.

దొంగ అనుకొని స్తంభానికి కట్టేసి..



సామెల్‌ను విద్యుత్ స్తంభానికి కట్టేసిన గ్రామస్తులు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని రాళ్లదొడ్డి గ్రామంలో సోమవారం మధ్యాహ్నం సమయంలో తాళం వేసిన ఇంటి దగ్గరకు ఓ వ్యక్తి వెళ్లి రాయితో కొడుతుండగా పక్కనే ఉన్న వారు గుర్తించి పట్టుకున్నారు. దొంగ అనుకొని దేహశుద్ధి చేసి విద్యుత్ స్తంభానికి కట్టే శారు. గ్రామంలోని మహిళలు అతనికి దేహశుద్ధి చేస్తుండటంతో యువకులు రూరల్ పోలీసుల సమాచారం అందించారు. ఆ వ్యక్తిని పట్టుకొని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఆ వ్యక్తిని మండల పరిధిలోని గార్లదిన్నె గ్రామానికి చెందిన సామెల్‌గా గుర్తించినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. అయితే అతను గత కొన్ని రోజులుగా మతిస్థితిమితం లేకపోవటంతో ఇంట్లో నుంచి బయటకు వచ్చి ఇలా తిరుగుతున్నాడని వెల్లడించారు.